లింక్ రోడ్లకు మహర్దశ

- మధిర నియోజకవర్గానికి రూ.334.87కోట్ల నిధులు
- ఐదు మండలాల్లోని గ్రామాల్లో తీరనున్న కష్టాలు
- శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి


బోనకల్ మండలంలో ఆళ్లపాడు నుండి నారాయణపురం మధ్య లింక్ రహదారి

బోనకల్: మధిర నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో లింక్ రహదార్లకు మహర్దశ పట్టనుంది. నియోజకవర్గ వ్యాప్తంగా 80 లింక్ రహదారుల నిర్మాణానికి రూ.334.87కోట్ల నిధులు మంజూరయ్యాయి. పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ నుంచి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ నిధులు మంజూరు చేయించారు.

నడిచేందుకు కూడా వీలు లేక..

పలుచోట్ల లింక్ రోడ్లు అధ్వానంగా మారడంతో రాకపోకలకు కష్టమవుతోంది. కంపచెట్లు రోడ్లను మూసేయడంతో పాటు గుంతలు పడడంతో పంట పొలాలకు వెళ్లి వచ్చేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే, కొన్ని గ్రామాలకు ఆటోలు కూడా నడిచే వీలు లేక సమస్య ఎదురవుతోంది. ఈ నేపథ్యాన డిప్యూటీ సీఎం భట్టి ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించడమే కాక ఇటీవల శంకుస్థాపన చేశారు. దీంతో గ్రామాల్లో ఇంక్ లింక్ రోడ్లు అభివృద్ధి చెంది ప్రజలు, రైతుల దారి కష్టాలు తీరనున్నాయి.

ఎక్కడెక్కడ?

బోనకల్ మండలంలో రాపల్లి నుండి బ్రాహ్మణపల్లి వరకు 2.1కిమీ దూరం లింక్ రోడ్డు నిర్మాణానికి రూ.2.45కోట్లు కేటాయించారు. అలాగే, తూటికుంట్ల నుంచి గోవిందాపురం(ఎల్) వరకు 4.3 కి.మీ మేర రోడ్డుకు రూ.3.95కోట్లు, చిరునోముల నుండి ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా దబ్బాకుపల్లి వరకు 2 కి.మీ. రోడ్డుకు రూ.1.75కోట్లు, కలకోట నుండి నారాయణపురం, ఆళ్లపాడు నుండి రావినూతల రోడ్డుకు రూ.1.50కోట్ల నిధులు మంజూరయ్యాయి. మధిర మండలంలోని రాయపట్నం నుండి మడుపల్లి రోడ్డుకు రూ.3.20కోట్లు, మునగాల నుంచి నక్కలగరుబు రోడ్డుకు రూ.2.70కోట్లు, చిలుకూరు నుంచి దొడ్డదేవరపాడు వరకు మిగిలిన పనికి రూ.1.25కోట్లు, మడుపల్లి నుంచి శివాపురం రోడ్డుకు రూ 60లక్షల నిధులు మంజూరు చేశారు. ఎర్రుపాలెం మండలంలోని ములుగుమాడు నుండి నాగవరపుపాడు రోడ్డుకు రూ.2.70కోట్లు, చొప్పకట్లపాలెం నుంచి బుచ్చిరెడ్డిపాలెం రోడ్డుకు రూ3.40కోట్లు కేటాయించారు. చింతకాని మండలంలోని పందిళ్లపల్లి నుండి మత్కేపల్లి రోడ్డుకు రూ.8.5కోట్లు, ఆర్అండ్‌బీ రోడ్డు నుండి జగన్నాధపురం వరకు రూ.రూ1.0కోట్లు, బీటీ రోడ్డు నుండి ఆర్అండ్‌బీ రోడ్డు వరకు, ఆర్అండ్‌బీ రోడ్డు నుండి వెంకటేశ్వరస్వామి టెంపుల్ వరకు, రేపల్లెవాడ రోడ్డుకు రూ.1.0కోట్లు మంజూరు చేశారు. ముదిగొండ మండలంలోని ఎడవల్లి నుంచి మాధాపురం వరకు రూ.5.80కోట్లు, కట్టుకూరు నుంచి ఎడవల్లి వరకు రూ.3.0కోట్లు, వెంకటాపురం నుంచి లక్ష్మీపురం రోడ్డుకు రూ.3.40కోట్లు, ఖమ్మం కోదాడ ఆర్‌ఎండ్‌బీ రోడ్డు నుంచి రాఘవాపురం వరకు గల రోడ్డుకు రూ.1.0కోట్లు, గోకినేపల్లి నుంచి ఆరెగూడెం రోడ్డుకు రూ.40లక్షలు, సీతారాంపురం నుంచి ఆరెగూడెం వరకు రూ.1.50కోట్లు, వల్లాపురం నుంచి మంగాపురం తండా వరకు రూ2.09కోట్లు, వల్లబి మల్లారం రోడ్డు నుంచి ఆంజనేయ స్వామి టెంపుల్ వరకు గల రోడ్డుకు రూ.3.0కోట్లు మంజూరైయ్యాయి.

ఏళ్ల కల నెరవేరింది..



ఎన్నో ఏళ్ళుగా లింక్ దారి నిర్మాణం కోసం దరఖాస్తులు పెట్టినప్పటికి ఫలితం లేకుండా పోయింది, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క చొరవతో రైతుల చిరకాల కోరిక నెరవేరింది.ఏపీ లోని డబ్బాకుపల్లి వరకు బీటీ రోడ్డు మంజూరు కావడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. – ఎర్రంశెట్టి సుబ్బారావు, మాజీ సర్పంచ్, చొప్పకట్లపాలెం

భూముల విలువ పెరుగుతుంది..



ఆళ్ళపాడు నుండి నారాయణపురం గ్రామాల వరకు గల లింక్ రహదారికి మోక్షం కలిగింది. దీంతో గ్రామాల మధ్య దూరం తగ్గుతుంది.భూముల రేట్లు కూడా పెరుగుతాయి.ఎన్నో ఏళ్ళుగా ఈ రహదారి కోసం రెండు గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. – కందుల పాపారావు, ఆళ్లపాడు

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు..

సాక్షి ఎఫెక్ట్..


సత్తుపల్లి బస్టాండ్‌లో పోలీస్ అవుట్‌పోస్టును ప్రారంభిస్తున్న సీఐ టి.కిరణ్

సత్తుపల్లిటౌన్: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సత్తుపల్లి సీఐ టి.కిరణ్ పేర్కొన్నారు. ఈ నెల 25న ఆకతాయిల ఆగడాలు శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం సత్తుపల్లి బస్టాండ్‌లో పోలీస్ అవుట్‌పోస్టును డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మితో కలిసి సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్టాండ్‌లో మహిళలు, విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా.. దొంగతనాలకు పాల్పడినా వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఒకపై ప్రతిరోజు ఒక కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ, మెకానికల్ ఇంజనీర్ ఎస్.సాహితి, విబిఓ కిన్నెర ఆనంద్, ఏడీసీలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఏజెన్సీ మండలాలకు సాగునీరు అందించాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

కారేపల్లి: సీతారామ ప్రాజెక్ట్ ద్వారా ఏజెన్సీ మండలాలకు సాగునీరు అందించాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. శనివారం కారేపల్లిలో నిర్వహించిన సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీల హామీలు నెరవేర్చాలన్నారు. సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఆగస్ట్ ఒకటిన తహసీల్ ఎదుట, 8న కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అదే విధంగా ఈ నెల 28న ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించే రాయల చంద్రశేఖర్ సంతాప సభకు కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఝాన్సీ, సందీప్, రాకేష్, తేజ్యా నాయక్, సత్తిరెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాయల సంస్మరణ సభను జయప్రదం చేయండి..

కొణిజర్ల: నేడు ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించే సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యుడు రాయల చంద్రశేఖర్ సంస్మరణ సభలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సీవై పుల్లయ్య, మండల కార్యదర్శి అప్పారావు పిలుపునిచ్చారు. మండలంలోని రామనర్సయ్యనగర్‌లో సంస్మరణ సభకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు.

ఆగస్టులో పాఠశాలల క్రీడలు


ఎర్రుపాలెం: మాట్లాడుతున్న ఎంఈఓ ప్రభాకర్

కొణిజర్ల/ఎర్రుపాలెం: కొణిజర్ల, ఎర్రుపాలెం మండల పాఠశాలల క్రీడలు ఆగస్టు నెలాఖరు నాటికి నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ మోదుగు శ్యాంసన్, ఎంఈఓ వై.ప్రభాకర్ తెలిపారు. శనివారం కొణిజర్ల, ఎర్రుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుని పాఠశాలల క్రీడలు నిర్వహించడానికి కృషి చేయాలన్నారు. అనంతరం నూతనంగా ఉద్యోగాలు సాధించిన, బదిలీపై వచ్చిన పీఈటీలను, పీడీలను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు అబ్రహం, శాంతకుమారి, జీవీఎస్ రాజు, సత్యనారాయణరెడ్డి, పీడీలు జమలయ్య, సాంబశివారెడ్డి, జీవీఎస్‌రెడ్డి, నాగేశ్వరరావు, అజీమ్, త్రిపుర జహీరా పాల్గొన్నారు.

ఘనంగా ఆషాఢ బోనాలు

ఎర్రుపాలెం/చింతకాని: మండలంలోని శ్రీముత్యాలమ్మ తల్లికి ఆషాఢం సందర్భంగా ఎస్వీ అకాడమీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, చింతకాని మండలంలోని నాగులవంచ శ్రీ గ్లోబల్ హైస్కూల్‌తో పాటుగా వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు బోనాల సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బోనాలు నెత్తిన పెట్టుకొని గ్రామ పురవీధుల్లో ప్రదర్శనగా అమ్మవారి ఆలయం వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమీ చైర్మన్ మిర్యాల శ్యామ్‌ప్రసాద్, కరస్పాండెంట్ నాగేశ్వరరావు, హెచ్‌ఎం సతీష్‌కుమార్, పాఠశాల కరస్పాండెంట్ దివాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

పెనుబల్లి: మహిళలపై అసభ్యంగా వ్యవహరిస్తున్న ఆగంతుకలను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ బాలికల మండల కమిటీ నాయకురాలు పర్వీన్ అన్నారు. ఈ విషయమై శనివారం ఎస్సై వెంకటేష్‌కు వినతిపత్రం అందించారు. కళాశాలకు వెళ్లేటప్పుడు, ఇంటికి వచ్చేటప్పుడు ఆకతాయిల ఆగడాలు భరించలేకపోతున్నామని, బస్సులు ఎక్కే సమయంలో తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బెజవాడ సాయిశేషు, మండల కార్యదర్శి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

'అప్పుల కుప్పగా మార్చారు..'


మాట్లాడుతున్న సుదర్శన్‌రావు

కారేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం రైతును రాజు చేస్తానని అప్పుల కుప్పగా మార్చారని సీపీఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, సోమయ్య తెలి పారు. శనివారం మండలంలో సీపీఎం గ్రామశాఖ కార్యదర్శి పోతర్ల నాగయ్య అధ్యక్షతన నిర్వహించిన రేపాకుల లాలయ్య సంస్మరణ సభకు వారు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. నాయకులు వీరభద్రం, నాగేశ్వరరావు, సత్యనారాయణ, బన్సిలాల్, రామారావు, మంగయ్య, మల్లయ్య, కొండయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి పరిశీలన

మధిర: మధిర ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిని శనివారం జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు పరిశీలించారు. రోగులతో మాట్లాడి ఆరోగ్యం, వైద్య సిబ్బంది అందిస్తున్న చికిత్స, వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఓపి రిజిస్టర్‌ను పరిశీలించారు. అన్ని రోగాలకు మందులు ఉన్నాయా లేవా అనే వివరాలతో పాటు సకాలంలో వ్యాక్సిన్లు అందుతున్నాయా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, నాయకులు భాస్కర్ రెడ్డి, శ్రీనివాసరావు, వీరారెడ్డి, నాగబాబు పాల్గొన్నారు.

పాఠశాలలో ఒలంపిక్ వేడుకలు

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు శ్రీభాస్కర మెమోరియల్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్యారిస్ ఒలంపిక్స్ 2024 క్రీడల ప్రారంభ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రీడలపై విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ బి.సూర్యనారాయణ అవగాహన కల్పించారు. ఒలింపిక్ జ్యోతి ప్రదర్శన చేశారు. పోటీల్లో పాల్గొనే దేశాల క్రీడల పేర్లతో కూడిన ప్లకార్డులను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ శ్రీదేవి, పాల్గొన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోండి

మధిరరూరల్: ఖాతాదారులకు పోస్టల్ శాఖ అందిస్తున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మధిర పోస్టల్ సబ్ డివిజనల్ అధికారి కోటేశ్వర్ తెలిపారు. శనివారం మాటూరుపేట బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లో నిర్వహించిన డెస్క్ కమ్యూనిటీ డెవలప్ మెంట్ ప్రోగ్రాం(డీసీడీపీ)లో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత బీమా పాలసీలను తీసుకోవడం వల్ల హెల్త్ ఇన్సూరెన్స్ కూడా వర్తిస్తుందని పేర్కొన్నారు. సంవత్సరానికి రూ.549తో రూ.10లక్షలు, రూ.749తో రూ.15 లక్షల ప్రమాద బీమా పొందవచ్చునన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే, శాశ్వత వైకల్యం, ప్రమాదవశాత్తు అంగవైకల్యం, ప్రమాదానికి సంబంధించిన వైద్య ఖర్చులు పోస్టల్ శాఖ బీమా ద్వారా పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఉదయ్, నవీన్, కోటేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ హెచ్ఎంకి సన్మానం

ముదిగొండ: మండలపరిధిలోని చిరుమర్రి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా పనిచేసి బదిలీపై వెళ్లిన షేక్ జానీమియాను పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుమలత, నాసర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి..

కల్లూరురూరల్: మండలంలోని కొర్లగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తూ బదిలీ అయిన శ్రీనివాసరావును గ్రామస్తులు, అధికారులు శని వారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కల్లూరు ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంపీఓ సురేష్‌బాబు, మాజీ సర్పంచ్ బైరెడ్డి నర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ నాగేశ్వరరావు, సొసైటీ వైస్ చైర్మన్ కృష్ణ, సిద్ధు, ప్రముఖులు సత్యనారాయణరెడ్డి, ఐకేపీ ఏపీఎం వెంకటరామారావు, ఈజీఎస్ జేఈ పుల్లారావు గ్రామస్తులు పాల్గొన్నార

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి


ఏన్కూరు: రాయమాదారంలో పంటలను పరిశీలిస్తున్న కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ రవి

ఏన్కూరు/కొణిజర్ల: యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.రవి, ఏఓ డి.బాలాజీ తెలిపారు. శనివారం ఏన్కూరు మండలంలోని రాయమాదారంలో, కొణిజర్లలోని తీగలబంజరలో వరి, పత్తి పంటలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు సలహాలు, సూచనలు ఇచ్చారు. వరి నాట్లు వేసుకోవచ్చని, దమ్ములో భాస్వరం ఇచ్చే ఎరువుల వేసుకోవాలని, స్వల్పకాలిక రకాలు ఈ నెల చివరి వరకు వేసుకోవచ్చన్నారు. అదే విధంగా పత్తిలో అధిక తేమ, నీరు నిల్వ ఉన్న ప్రాంతంలో పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, శిలీంధ్రం పత్తి వేర్లను ఆశ్రయించి ఆహారం తీసుకోవడం వల్ల మొక్క చనిపోతుందన్నారు. దీని నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 400 గ్రాములు ప్లాంటోమైసిన్‌తో కలిపి చెట్టు మొదట్లో తడిచేలా చేతి పంపుతో పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి నర్సింహరావు, ఏఈఓలు ఎ రవికుమార్, బాలకృష్ణ , రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా


తల్లాడ: ఎంఈఓ దామోదరప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

తల్లాడ/కల్లూరు: మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. శనివారం తల్లాడ, కల్లూరులోని విద్యావనరుల కేంద్రం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం తల్లాడలో కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు మాట్లాడుతూ.. గత విద్యా సంవత్సరం నుంచి రావాల్సిన మెనూ చార్జీలు, కోడిగుడ్ల బిల్లులు, 9,10 తరగతుల మెనూ బిల్లులు, మరియు తెలంగాణా ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.2వేల వేతనం ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ సమస్యలపై ఈ నెల 31న ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు వెంకటమ్మ, పద్మ, మరియమ్మ, భాగ్యవతి, నక్షత్రం, లక్ష్మీ, కనకమ్మ, శిరోమణి, విమల, రాణా, సీపీఐ మండల కార్యదర్శి దయాకర్, ఎండీఎం కార్మికులు సత్యవతి, రమాదేవి, అప్పమ్మ, పుల్లమ్మ, అనసూర్య, ధనమ్మ, అలివేలు, మారెమ్మ, వెంకట్రావమ్మ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల నిరసన ర్యాలీ

బోనకల్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆటో కార్మికులు మండల కేంద్రంలో బోనకల్ టూ ఖమ్మం ప్రధానరహదారిపై ఆటోలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు మందా యాదగిరి మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లు జీవనోపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ.5లక్షల ప్రమాద బీమా కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, వెంకటేష్ గౌడ్, రమేష్, సుదాకర్, ప్రబాకర్, ఆదినారాయణ, పున్నయ్య, మస్తాన్, జాన్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

పెనుబల్లి: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ అన్నపూర్ణ అన్నారు. శనివారం మండలంలోని అడవిమల్లేల గ్రామంలో లంకాసాగర్ పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ కిరణ్ కుమార్, పంచాయతీ సిబ్బందితో కలిసి పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అవసరమైన ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వేయించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రకాశరావు, నిర్మలకుమారి, పంచాయతీ సెక్రటరీ మహేష్, ఏఎన్ఎం కుమారి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న స్వర్ణలత

మధిర: మధిర పట్టణంలోని మదర్ థెరిస్సా మానసిక వికలాంగుల సేవాసదనంలో శనివారం దివ్యాంగులకు అన్నదానం చేశారు. ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం అల్లూరు గ్రామానికి చెందిన మేకా అరుణ వర్ధంతి సందర్భంగా ఆమె కుమార్తెలు హిషిత, నిఖిత ఆర్థిక సహకారంతో మానసిక దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకురాలు నల్లపు స్వర్ణలత మాట్లాడుతూ అన్నదానం చేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

గీతా మందిరంలో..

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని శ్రీగీతాజ్ఞాన మందిరంలో గల శ్రీపార్థసారధిస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణానికి చెందిన నడిపల్లి శ్రీనివాసరావు, వాణి దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపూరి పురుషోత్తం, కొత్తూరు రాజా, వెంకటేశ్వరరావు, అర్చకులు చైతన్యస్వామి పాల్గొన్నారు.

గొల్లపూడి వృద్ధాశ్రమంలో..

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు వైరా గ్రేట్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ జీఎస్టీ కోఆర్డినేటర్ ఉంద్రూ శ్యాంబాబు తల్లి అమ్మాజీ వర్ధంతి వేడుకలను పురస్కరించుకొని అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో లయన్ ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ కాపా మురళీకృష్ణ, క్లబ్ బాధ్యులు వరలక్ష్మి, కిషన్, రామకృష్ణ, అజయ్, ఉంద్రూ జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలామ్ ఆదర్శప్రాయుడు

ముదిగొండ/మధిరరూరల్: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ముదిగొండ, మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు వాసిరెడ్డి శ్రీనివాస్, జయదాస్ అన్నారు. ముదిగొండలోని జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో కలాం వర్ధంతి శనివారం నిర్వహించి ఆయన విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. మధిర కళాశాలలో కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకటేశ్వర్లు, తౌరియా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

108లో మహిళ ప్రసవం

సత్తుపల్లిరూరల్: 108 వాహనంలో మహిళ ప్రసవించిన సంఘటన శనివారం సత్తుపల్లి పట్టణంలో చోటు చేసుకుంది. మండలంలోని సిద్ధారం గ్రామానికి చెందిన పి.రమాదేవి పురిటి నొప్పులతో 4 గంటల నుంచి సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో బాధపడుతుంది. ఆమె థైరాయిడ్ సమస్యతో పాటు బ్లడ్ తక్కువగా ఉండటంతో వైద్యులు ఖమ్మంలోని మాతా శిశు సంరక్షణ ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేయగా.. 108లో ఖమ్మం వెళ్తుండగా పల్లిపాడు సమీపంలో సుఖప్రసవంలో పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అనంతరం ఖమ్మం తరలించగా తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ కె.మాధవరావు, పైలట్ కె.శివకృష్ణ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

మధిర: మధిర బోడేపూడి భవన్‌లో హైదరాబాద్ యశోద ఆస్పత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ శనివారం సీపీఎం కార్యాలయంలో వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేశ్వరరావు, నాయకులు నరసింహారావు, సైదులు, మురళి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధి సాధించాలి

చింతకాని: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యాభివృద్ధి సాధించాలని గ్రేస్ సోషల్ సర్వీస్ సొసైటీ ప్రతినిధి మురళీకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మత్కేపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సొసైటీ సభ్యులు స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పందిళ్లపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామ్మోహన్‌రావు, మత్కేపల్లి ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రామచందర్‌రావు, గ్రేస్ సోషల్ సర్వీస్ సొసైటీ ప్రతినిధులు యాసిన్, సతీష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కారేపల్లి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన భాగ్యనగర్‌తండా గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ తేజావత్ బాలాజీ కుటుంబానికి తోటి సైనికులు, తెలుగు సైనిక మిత్రులు రూ. 1.20లక్షల ఆర్థిక సాయాన్ని కారేపల్లి ఎస్సై ఎన్.రాజారాం, ఐటీబీసీ పారా మిలిటరీ జవాన్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ హలావత్ నాగేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ గంగరాజు చేతుల మీదుగా శనివారం అందించారు. అంతకుముందు జవాన్ బాలాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఐటీబీసీ పారా మిలిటరీ జవాన్లు కిషన్, సతీష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కొర్లగూడెం గ్రామానికి వైకుంఠ రథం వితరణ

కల్లూరురూరల్: మండలంలోని కొర్లగూడెం గ్రామానికి రూ.3 లక్షలు విలువ చేసే వైకుంఠ రథాన్ని అమెరికాలో ఉంటున్న అదే గ్రామానికి చెందిన డాక్టర్ సూరవరపు సీతారామిరెడ్డి వితరణ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైకుంఠ రథాన్ని డాక్టర్ సీతారామిరెడ్డి అన్నయ్య సూరపురెడ్డి అనంతరెడ్డి పంచాయతీకి అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంపీఓ సురేష్‌బాబు, మాజీ సర్పంచ్ బైరెడ్డి నరసింహారెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ కృష్ణ(సిద్ధు), ప్రముఖులు సత్యనారాయణరెడ్డి, నాగేశ్వరరావు, ఐకేపీ ఏపీఎం వెంకటరామారావు, రిటైర్డ్ సీఐ రాఘవరెడ్డి, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్ పాల్గొన్నారు.

మధిర తహసీల్దార్‌గా రాంబాబు

మధిర: మధిర తహసీల్దార్‌గా శనివారం తహసీల్‌లో రాంబాబు బాధ్యతలు చేపట్టారు. మధిరలో పనిచేసిన తహసీల్దార్ వెంకటేశ్వర్లు జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ కాగా కొణిజర్లలో పనిచేస్తున్న రాంబాబు బదిలీపై మధిరకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఏదైనా సమస్య ఉంటే నేరుగా తహసీల్‌కు రావాలని సూచించారు. అనంతరం ఆయన కొన్ని ఫైళ్లను పరిశీలించి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశారు.

క్లుప్తంగా

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

ఏన్కూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నతస్థాయికి ఎదగాలని అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ సూచించారు. మండలంలోని జన్నారం జెడ్పీహెచ్ఎస్‌ను శనివారం సందర్శించిన ఆయన 6 నుండి 10వ తరగతి వరకు విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి మాట్లాడారు. కాగా, అదనపు తరగతి గదులు, టాయిలెట్లు, ప్రహరీ మంజూరు చేయించాలని విద్యార్థులు ఆయనను కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాస్

సత్తుపల్లిటౌన్: కొత్త న్యాయ చట్టాలపై జూనియర్ న్యాయవాదులు అవగాహన పెంపొందించుకోవాలని 6వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీనివాస్ సూచించారు. సత్తుపల్లి కోర్టులో శనివారం ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన భారతీయ న్యాయ సంహిద, భారతీయ నాగరిక్ సుర్క్ష సన్హిత, భారతీయ సాక్షా అధినియం చట్టాల వివరాలు వెల్లడించారు. సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కే.మీరా ఖాసీంసాహెబ్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి వద్ది లావణ్య, ఏపీ బోయినపల్లి రవి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన

తల్లాడ: మానవ అక్రమ రవాణా పట్ల అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ చందర్ అన్నారు. తల్లాడలోని పినపాక హైస్కూల్‌లో శనివారం మానవ అక్రమ రవాణాపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉమా, స్కూల్ హెచ్‌ఎం కైలాస్ సత్యార్థి, ఎన్‌జీఓ రాందాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో వనమహోత్సవం


వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో మొక్క నాటుతున్న కమిషనర్ వేణు, కంట్రోలర్ వెంకటేశ్వరరావు

వైరా: వనమహోత్సవంలో భాగంగా వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం వైరా మున్సిపల్ కమిషనర్ చింతా వేణు, బస్టాండ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి పెద్ద చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం


ఏజీపీగా నియమితులైన రామచంద్రారెడ్డి

సత్తుపల్లి: సత్తుపల్లిలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా సత్తుపల్లి సీనియర్ న్యాయవాది గొర్ల రామచంద్రారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

వేంసూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మట్టా ప్రసాద్ అన్నారు. శనివారం మండల పరిధిలోని చౌడవరంలో జరిగిన బీజేపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీకి కార్యకర్తలే బలమన్నారు. సింగరేణిలో స్థానికుల ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాంబాబు, నాగసురేంద్ర రెడ్డి, సీతారాం, మహేష్, వెంకటరెడ్డి, భాస్కర్, నవీన్ పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వాలు

ముదిగొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పానుకుల సుధాకర్ అన్నారు. శనివారం ముదిగొండలో ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షుడు సాయిరాం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు వినయ్, అఖీల్, మధు, చరణ్, నవీన్, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లిరూరల్: గౌరిగూడెం 33/11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా సబ్ స్టేషన్ పరిధిలోని గౌరిగూడెం, కొత్తూరు, రేజర్ల, సర్వరాయ, సిద్ధారం మెయిన్‌రోడ్, రాజీవ్‌నగర్‌లలో ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శరత్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.